క్లుప్తంగా

వయోపరిమితి పెంచాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో ఎక్స్‌ట్రనల్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల వయోపరిమితి 35ఏళ్ల నుంచి 40ఏళ్లకు పెంచాలని జేఎంఈటీ అభ్యర్థులు గురువారం ఒక ప్రకటనలో యాజమాన్యాన్ని కోరారు. తామంతా డిప్లమా మైనింగ్ ఇంజనీరింగ్ పూర్తి చేశామని, గడిచిన 8సంవత్సరాల నుంచి జేఎంఈటీ పోస్టుల నోటిఫికేషన్ రాలేదన్నారు. ఇటీవలే కంపెనీ నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. 8ఏళ్ల జాప్యం వల్ల మైనింగ్ చేసిన తమలో చాలా మందికి వయస్సు 35ఏళ్లు దాటిందన్నారు. ఈ కొత్త నోటిఫికేషన్ ప్రకారం వచ్చే నెల 15నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారన్నారు. కావున ఈ లోపు వయస్సు పెంపుదలపై కంపెనీ నిర్ణయం తీసుకోవాలని కోరా రు. దీనిపై తాము పలుమార్లు కొత్తగూడెంలో ఉన్నత అధికారులకు కూడా వినతి పత్రాలు ఇచ్చామని గుర్తు చేశారు.

రేపు 'రన్ ఫర్ జీసస్'


మాట్లాడుతున్న క్రైస్తవులు

రామకృష్ణాపూర్: ఏసుక్రీస్తు ప్రభువు పునరుత్థానుడై తిరిగి లేచిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈ నెల 30న నిర్వహించే రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యక్రమ కన్వీనర్ డొలక్‌ల్ డేవిడ్ కోరా రు. పట్టణంలోని సీఎస్ఐ సెయింట్ పీటర్స్ చర్చిలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం ఉద యం స్థానిక రాజీవ్‌చౌక్‌లో రన్ ప్రారంభమై సీఎస్ఐ చర్చి వరకు సాగుతుందన్నారు. క్రైస్త వ భక్తులు, యువకులు, మహిళలు, పిల్లలు పెద్ద సంఖ్యలో హాజరై రన్‌ను జయప్రదం చేయాలని కోరారు. చర్చి పాస్టర్ జాషువా, శరత్‌బాబు, దేవానందం, ప్రేమలత, పుష్పరాజు తదితరులు పాల్గొన్నారు.

బోర్‌వెల్‌కు మరమ్మతులు



సాక్షి ఎఫెక్ట్..

భీమిని: కన్నెపల్లి మండలంలోని కుర్మగూడం (మొక్కంపల్లి) గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో 'కుంగిన బోరు అందని నీరు' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా అదనపు కలెక్టర్ ఆదేశాలతో కుర్మగూడం ప్రాథమిక పాఠశాల ఎదుట ఉన్న బోరువెల్‌కు మరమ్మతు చేపట్టి పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. స్థానికులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీఎల్ క్రికెట్ లీగ్ బ్రోచర్ ఆవిష్కరణ


బ్రోచర్ విడుదల చేస్తున్న నిర్వాహకులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీల బ్రోచర్లను గురువారం పాతమంచిర్యాల క్రికెట్ మైదానంలో ఓఎంఎస్‌సీ అధ్యక్షుడు బొలిశెట్టి కిషన్ ఆవిష్కరించారు. వచ్చే నెల 14వ తేదీ నుంచి పోటీలు జరుగుతాయని, ఈ నెల 31వ తేదీలోపు పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు వేలం ఉంటుందని నిర్వాహకులు గురు అకాడమీ దుర్గా ప్రసాద్ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు రూ.300 చెల్లించి, వారి పేర్లను నమోదు చేసుకోవాలని, ఫ్రాంఛైజ్ ఓనర్లు రూ.15వేలు చెల్లించి జట్టును ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఓఎంస్‌సీ సభ్యులు ఎర్రం ప్రభాకర్, తూముల ప్రభాకర్, ఎడ్ల మల్లేశ్, ఆమోస్, నామాల విజయ్, సిద్ధు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగులు, స్టేషనరీ కిట్లు అందజేత

మంచిర్యాలటౌన్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని శ్రీశ్రీనగర్‌లో నిర్వహిస్తున్న అనాథ పిల్లల ఆశ్రమంలోని పిల్లలు 30మందికి మ్యాన్‌కైండ్ ఫార్మా లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు, లంచ్ బాక్సు, స్టేషనరీ ఐటమ్స్‌తో కూడిన కిట్లను గురువారం అందించారు. పిల్లలకు అవసరమైన వాటిని రూ.30వేలతో కొనుగోలు చేసి అందించినట్లు మ్యాన్‌కైండ్ ఫార్మా ఏరియా మేనేజర్ దాసరి సాయిబాబా తెలిపారు.



ఈ ఫొటోలో కన్పిస్తున్న ఉపాధిహామీ కూలీలు నెన్నెల మండల కేంద్రం సమీపంలో పనులు చేస్తున్నారు. వీరు నిత్యం నెన్నెల నుంచి 2 కిలోమీటర్ల దూరంలోని శివారు ప్రాంతానికి వెళ్తుంటారు. ఉదయం 7గంటలకు వెళ్లి పని పూర్తి చేసుకుని, యాప్‌లో హాజరు నమోదు చేసుకునే సరికి ఉదయం 10, 11 గంటలు దాటుతుంది. పని మధ్యలో సేదతీరేందుకు కనీసం వారికి నీడ సౌకర్యం కూడా ఏర్పాటు చేయలేదు. ప్రమాదవశాత్తు ఎవరికైనా గాయమైతే ఫస్ట్ ఎయిడ్ కిట్ కూడా అందుబాటులో లేదు. జిల్లా వ్యాప్తంగా దాదాపు ఇదే పరిస్థితి ఉంది.

'ఓఆర్ఎస్' అందుబాటులో ఉంచుతున్నాం

జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల పరిధిలో చేపడుతున్న ఈజీఎస్ పని ప్రదేశాల్లో కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నాం. వైద్య, ఆరోగ్యశాఖ సహకారంతో పాటు జిల్లా, మండల అధికారుల సహకారంతో ఓఆర్ఎస్ అందేలా ఏర్పాట్లు చేశాం. రెండు రోజుల్లో అన్ని గ్రామాల్లో కూలీలకు ఓఆర్ఎస్ విధిగా అందుబాటులో ఉంటాయి.

- కిషన్, డీఆర్‌డీవో

తల్లడిల్లుతున్న ఉపాధి కూలీలు

- పెరుగుతున్న ఎండలతో సతమతం
- పని ప్రదేశాల్లో నీడ, నీళ్లు కరువు
- కానరాని ప్రథమ చికిత్స కిట్లు
- పట్టించుకోని అధికారులు

ఉపాధి హామీ వివరాలు ఇలా..

మండలాలు	-	16
జాబ్‌కార్డులు	-	1,20,502
మొత్తం కూలీలు	-	2,25,764
కుటుంబాలు	-	55,822

నెన్నెల/మంచిర్యాలరూరల్(హాజీపూర్): రోజురోజుకూ పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతూ ప్రచండ భానుడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. గురువారం జిల్లాలోని కాసిపేటలో అత్యధికంగా 42.1 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గడిచిన మూడు రోజులుగా జిల్లా సగటు ఉష్ణోగ్రతలు 40డిగ్రీల పైనే ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలు ఎండకు తల్లడిల్లుతున్నారు. పని ప్రదేశంలో వసతులు లేకపోవడంతో తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. మాడపగిలే ఎండలో పనులు చేస్తున్నారు. సాధారణ ప్రజానికం ఇళ్లల్లోనే ఉన్న ఎండతో వేగలేకపోతున్నారు. అలాంటిది ఉపాధిహామీ పథకం కూలీలు మండుతున్న ఎండలో పనులు చేస్తూ ఉక్కిరిబిక్కిరవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 16మండలాల్లో 311 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇక జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో కలిపి 1,20,502జాబ్ కార్డులు ఉండగా మొత్తం 2,25,764మంది కూలీలు ఉన్నారు. కుటుంబాల వారీగా చూస్తే 88,822 కుటుంబాలు ఉపాధి హామీ పనుల్లో భాగస్వామ్యం అవుతున్నాయి. అసలే వేసవి.. ఆపై ఎండలో పనులు కాగా ఉపాధిహామీ పనుల ప్రదేశంలో కల్పించాల్సిన కనీస సౌకర్యాలు ఎక్కడా కనిపించడం లేదు. చట్ట ప్రకారం పనిప్రదేశంలో తాగునీరు, టెంట్ వసతి కల్పించాలి. టెంట్ లేకపోవడంతో సమీపంలోని చెట్ల కింద సేద తీరుతున్నారు. సౌకర్యాలు ఎక్కడా కానరావడం లేదు. నీటి వసతి లేకపోవడంతో కూలీలు డబ్బాలు వెంట తెచ్చుకుంటున్నారు. కనీసం కొన్ని చోట్ల ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా పంపిణీ చేయడం లేదని కూలీలు వాపోతున్నారు.


దొనబండ చెరువు వద్ద పనుల్లో ఉపాధి కూలీలు

కనిపించని కిట్లు..

కూలీలకు గునపాలు కాలికి తగిలిన, వడదెబ్బకు గురైన వెంటనే ప్రథమ చికిత్స చేయడానికి వీలుగా పనుల వద్ద ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలి. కానీ ఎక్కడ కూడా కనిపించడం లేదు. కొన్నిచోట్ల మేట్ల ఇళ్లలోనే ఉంచుకున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు పనిప్రదేశాల్లో కనీస వసతులు కల్పించాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు.

కిట్లు ఏర్పాటు చేయాలి



నేలలు గట్టిగా ఉన్నాయి. గునపాలతో పనులు చేస్తున్నప్పుడు ఒక్కొక్కసారి ఎగిరి కాలిమీద పడుతున్నాయి. ఈ సమయంలో పనుల వద్ద ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంటే మంచిది. కానీ అధికారులు అవేమి పట్టించుకోవడం లేదు. రెండేళ్ల క్రితం ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించారు. ఈ సారి అలాంటి సౌకర్యం కల్పించడం లేదు.

- పల్ల బక్కయ్య, ఉపాధి కూలీ, నెన్నెల

వసతులు లేవు



ఉపాధిహామీ పథకం పనుల వద్ద కూలీలకు నీడ కల్పించడం లేదు. ఉదయం 9గంటలకే ఎండలు మండిపోతున్నాయి. జీవనోపాధి కోసం ఎండలను కూడా లెక్కచేయకుండా పనులు చేస్తున్నాం. అధికారులు స్పందించి ఎండాకాలంలో దప్పిక తీర్చడానికి నీటి వసతితో పాటు నీడ సౌకర్యం కల్పించాలి.

- ముస్కె బుజ్జక్క, ఉపాధి కూలీ, నెన్నెల

ఘనంగా గుర్రాల శ్రీధర్ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న అంజనీపుత్ర సంస్థ చైర్మన్ శ్రీధర్

మంచిర్యాలటౌన్: అంజనీపుత్ర సంస్థ చైర్మన్ గుర్రాల శ్రీధర్ జన్మదిన వేడుకలను జిల్లా కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి, ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంజనీపుత్ర సంస్థ ఎండీ పిల్లి రవి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. గుర్రాల శ్రీధర్ చేస్తున్న సేవా కార్యక్రమాలను పలువురు కొనియాడారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, అంజనీపుత్ర సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్లు సంతోశ్, కిషన్, అభిమానులు పాల్గొన్నారు.

చెన్నూర్‌లో 5కే రన్


5కే రన్ ప్రారంభిస్తున్న ఏఆర్వో

చెన్నూర్: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఏఆర్వో చంద్రకళ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానం నుంచి పెద్ద చెరువు రావి చెట్టు వరకు భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ 5కే రన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఆర్వో మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ లక్ష్మీనారాయణ, మందమర్రి తహసీల్దార్ చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ గంగాధర్, వాకర్స్ సభ్యులు, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మండల అధ్యక్షుడిగా ప్రసాద్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా దొనబండ గ్రామానికి చెందిన రేవెళ్ల ప్రసాద్ నియామకమయ్యారు. ఈ మేరకు గురువారం డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ చేతుల మీదుగా ప్రసాద్‌కు నియామక లేఖను అందజేశారు.

ఘనంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం

మందమర్రిరూరల్: పట్టణంలోని రెండో జోన్, రైల్వే స్టేషన్ రోడ్డులోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎదుర్కోళ్లు, పల్లకీ సేవా, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. అర్చకులు కుషకుమార్, డింగరాచారి, వెంకటేశ్వర్లు, నూతి తిరుపతి లక్ష్మీ దంపతులు పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి రాజయ్య, కోశాధికారి శ్రీనివాస్, వేణు, రాజు తదితరులు పాల్గొన్నారు.


కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కనులపండువగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ


విగ్రహాలు ఆలయానికి తీసుకొస్తున్న భక్తులు

జన్నారం: మండలంలోని రేండ్లగూడలో శ్రీ హనుమాన్, లక్ష్మణ సమేత సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ కనులపండువగా నిర్వహించారు. ప్రధాన ఆచార్యులు గొల్లపెల్లి రామనందస్వామి, శ్రీధరాచార్యులు ఆధ్వర్యంలో విగ్రహాలను ప్రతిష్ఠించారు. పూజారుల మంత్రోశ్చరణల మధ్య సీతారాములు కొలువుదీరారు. ప్రతిష్ఠ అనంతరం తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, బీజేపీ నాయకులు రితీశ్ రాథోడ్, ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. నాయకులు, పెద్దలు, యువకులు పాల్గొన్నారు.


పూజలు నిర్వహిస్తున్న ప్రధాన అర్చకులు

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

- హాజరైన సినీ హీరో సుమన్, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని హైటెక్‌సిటీ కాలనీలోని హరిహరక్షేత్ర దేవాలయం షష్ఠమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. సినీ హీరో సుమన్ ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. మంగళ వాయిద్య వేదస్వస్తివచనములు, గణేశ పూజ, పుణ్యాహవచనము, శివ కల్యాణ మహోత్సవం, హారతి కార్యక్రమాలు నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న డీసీసీ అధ్యక్షురాలు సురేఖ

'కుల మతాలను గౌరవించాలి'

పాతమంచిర్యాల: సమాజంలో ప్రతి ఒక్కరూ కుల మతాలకు అతీతంగా కలిసిమెలిసి ఉండాలని ప్రముఖ సినీనటులు సుమన్ అన్నారు. వెలుగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సావిత్రీ ఫర్నీచర్ షాపులో గురువారం ఏర్పాటు చేసిన రంజాన్‌తోఫా పంపిణీ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. మానవులంతా ఒక్కటే అని కులాలు మతాల పేరిట విద్వేషాలు పెంచుకోవద్దని శాంతియుతంగా జీవించాలన్నారు. పేద ముస్లింలకు రంజాన్ తోఫాను వెలుగుఫౌండేషన్ వ్యవస్థాపకులు రాంప్రకాష్‌తో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెలుగు ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ మడుపు అరుణ, రహీం బ్లడ్ డొనేషన్ ఆర్గనైజింగ్ సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ రహీం, ముస్లింలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సినీ హీరో సుమన్

ఆధ్యాత్మికం

మడేలయ్య ఆలయంలో పూజలు


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న రజక సంఘం నాయకులు

జైపూర్: మండలంలోని ఇందారం–మారావుపేట పెద్ద చెరువు కట్టపై నూతనంగా రజక సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన మడేలయ్య ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహప్రతిష్టాపన పూజాకార్యక్రమాల్లో ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించారు. రజకులు, స్థానిక ప్రజలు విగ్రహప్రతిష్టాపన పూజాకార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు.

మాల్గాం మల్లన్న పట్నాలు షురూ

దండేపల్లి: మండల కేంద్రంలోని శ్రీ మాల్గాం మల్లన్న ఆలయంలో నిర్వహించే స్వామివారి పట్నాల వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు జోగు కార్యక్రమంలో భాగంగా యాదవ కులస్తులు ఒగ్గు కళాకారులతో కలిసి ఇంటింటా తిరిగారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కుమారస్వామి, భూమన్న, అశోక్, శ్రీనివాస్, మహేష్, రాజన్న, సత్తన్న, రాజన్న, నరేష్, బాపు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం ఇవ్వాలి

జన్నారం: ఇటీవల కురిసిన అకాల వడగండ్ల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు వెంటనే రూ.25వేల పరిహారం అందించాలని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్ నాయక్ డిమాండ్ చేశారు. మండలంలోని తిమ్మాపూర్, తపాలపూర్ గ్రామాల్లో వర్షాలకు నష్టపోయిన మొక్కజొన్న, వరి పంటలను గురువారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వం దృష్టి సారించి వెంటనే రైతులకు పరిహారం అందించాలని, లేకపోతే రైతుల పక్షాన బీఆర్ఎస్ ఆందోళనలకు దిగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, కో ఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీఖాన్, మాజీ సర్పంచ్ జాడి గంగాధర్, జిల్లా అధికార ప్రతినిధి భరత్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి జనార్దన్, నాయకులు ఫజల్‌ఖాన్, రాజేశ్వర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.


పంటను పరిశీలిస్తున్న జాన్సన్‌నాయక్

'కాలం చెల్లిన సిద్ధాంతాలు నమ్మొద్దు'

వేమనపల్లి: కాలం చెల్లిన సిద్ధాంతాలతో అసాంఘిక శక్తులు ముందుకొస్తే నమ్మకూడదని చెన్నూర్‌రూరల్ సీఐ సుధాకర్ అన్నారు. వేమనపల్లి మండల కేంద్రంలో నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్‌తో కలిసి గురువారం గ్రామస్తులకు ఎన్నికలపై అవగాహన కల్పించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలని, ఎలాంటి ప్రలోభాలకు లొంగకూడదన్నారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. అపరిచిత వ్యక్తులు, అనుమానిత వ్యక్తులు తారసపడితే సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం సీఆర్పీఎఫ్, స్పెషల్ పార్టీ పోలీసులతో కలిసి ఇంటింటికీ వెళ్లి నచ్చిన వ్యక్తికి ఓటు వేయాలని సూచించారు. ఆయన వెంట ఎస్సై శ్యాంపటేల్ ఉన్నారు.


అవగాహన కల్పిస్తున్న రూరల్ సీఐ సుధాకర్

క్షేత్ర పర్యటనలతో ఎంతో ప్రయోజనం

బెల్లంపల్లిరూరల్: క్షేత్ర పర్యటనలతో విద్యార్థుల్లో మరింత నైపుణ్యం పెరిగి ఎంతో ప్రయోజనం కలుగుతుందని బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. కళాశాలకు చెందిన కామర్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్లు మేడ తిరుపతి, కాంపెల్లి శంకర్‌ల ఆధ్వర్యంలో గురువారం బెల్లంపల్లి సబ్ డివిజన్ పోస్టు కార్యాలయానికి విద్యార్థులు క్షేత్ర పర్యటనకు వెళ్లారు. పోస్టల్ సేవలు ఎన్ని రకాలు, ఏ విధంగా ఉపయోగపడుతాయి, వాటి వల్ల ప్రయోజనాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోస్టాఫీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పోస్టాఫీస్ ఎదుట విద్యార్థులు, ఉపాధ్యాయులు

అలరించిన నృత్యాలు

జన్నారం: మండలంలోని ఏఆర్ఎస్ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యం అలరించింది. ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు ఆడిపాడారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సతీశ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపులు

దండేపల్లి: మండలంలోని వెల్గనూర్‌కు చెందిన కడ్తల గురువయ్య గతేడాది జూన్ 11న పిడుగుపాటుతో మృతి చెందాడు. పిడుగు పాటుతో మృతిచెందిన వారికి ప్రభుత్వం అందించే సాయం కోసం గురువయ్య కొడుకు వెంకటేశ్ దండేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో అందుకు సంబంధించిన ధ్రువపత్రాలు అందించారు. తొమ్మిది నెలలైనా సాయం అందకపోవడంతో, ఒకటి, రెండుసార్లు తహసీల్ కార్యాలయానికి వచ్చి వెళ్లాడు. ఫైల్ ఇంకా ఆర్డీవో కార్యాలయానికి పంపలేదని అధికారులు చెప్పినట్లు పేర్కొన్నాడు. పిడుగుపాటుతో చనిపోయిన వారికి ప్రభుత్వం అందించే సాయాన్ని త్వరగా అందించాలని గురువయ్య భార్య లచ్చవ్వ, కొడుకు వెంకటేశ్ అధికారులను వేడుకుంటున్నారు. ఈ విషయమై తహసీల్దార్ సంధ్యారాణిని సంప్రదించగా పిడుగుపాటుతో మృతిచెందిన వారికి సాయం అందించేందుకు ఆపద్బంధు స్కీం నిబంధనలు వర్తిస్తాయి. దానికి వయ్యస్సు(65) వరకు మాత్రమే నిబంధనలు ఉన్నాయి. గురువయ్యది వయస్సు ఎక్కువ ఉండటంతో కొంత సందిగ్ధత ఉంది. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు చెప్పారు.

వంగిన విద్యుత్ స్తంభం

మంచిర్యాలటౌన్: పట్టణంలోని రాముని చెరువు కట్టపైన గల పోచమ్మ గుడి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం ఒక వైపు వంగిపోయి ప్రమాదభరితంగా ఉంది. ఒకవైపు వంగిపోయి ఎప్పుడు పడిపోతుందో అన్నట్లుగా ఉండడంతో, విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ స్తంభం సరిచేయాలని రాముని చెరువు వాకర్ అసోసియేషన్ అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, వాకర్ సభ్యులు కోరారు.



సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల:
9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి : సంపత్ - 7036227114
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899